క్లుప్తంగా

ఇండస్ట్రియల్ ఏరియాలో నేడు విద్యుత్ నిలిపివేత

చీమకుర్తి: మండలంలోని చీమకుర్తి, ఆర్.ఎల్.పురం, బూదవాడ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటితో పాటు చినరావిపాడు, బూసురపల్లి, పరిసర గ్రామాల్లో కూడా కరెంటు ఉండదని చెప్పారు. చీమకుర్తి తూర్పు సబ్ స్టేషన్, మర్రిచెట్లపాలెం సబ్‌స్టేషన్లలో రెండో శనివారం మరమ్మతుల నేపథ్యంలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో జాతీయ రహదారి వెంట అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని స్థానిక ఎస్సై శ్రీరామ్ పట్టుకుని అరెస్టు చేశారు. ఎస్సై విజువల్ పోలీసింగ్‌లో భాగంగా గుండ్లాపల్లి వైపు వెళ్తుండగా గుండ్లాపల్లి సమీపంలోని దాబా వద్ద చావా రామారావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా గమనించి పట్టుకున్నారు. అతన్ని సోదా చేయగా 9 క్వార్టర్ బాటిళ్ల మద్యం దొరికింది. దీంతో అతన్ని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అదే వ్యక్తి గతంలో నాలుగుసార్లు అక్రమంగా మద్యం అమ్ముతున్న కేసుల్లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

స్వయం ఉపాధికి ఆర్థిక చేయూత

ఒంగోలు అర్బన్: పేద మహిళకు స్వయం జీవనోపాధి కల్పించేలా పిండి మర ఏర్పాటు చేసుకుని నిర్వహించేలా సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆ మహిళకు శుక్రవారం ఆర్థిక సహాయం అందించారు. టంగుటూరు మండలం పొందూరు గ్రామానికి చెందిన టంగుటూరు అమృత అనే మహిల స్వయం ఉపాధికి రూ.30 వేల విలువ కలిగే పిండి మర ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందించారు. ఏషియన్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బొడ్డపాటి రాజశేఖర్, ట్రస్టు సభ్యులు సర్దార్ బాష, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, నేరెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు

పర్చూరు: మండలంలో బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పర్చూరు ఎస్సై ఎస్‌సీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే పలువురిని అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ కట్టలు, రోడ్ల పక్కన మద్యం సేవించే వారిని అదుపులోనికి తీసుకుంటామన్నారు. అన్ని గ్రామాల్లో సాయంత్రం పోలీసులు గస్తీ తిరుగుతూ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ కనిపిస్తే వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామన్నారు.

ఆహారపు అలవాట్లతో మెరుగైన ఆరోగ్యం

చినగంజాం: ప్రస్తుత కాలంలో ప్రజలందరూ మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకుంటే ఎక్కువ కాలం జీవించవచ్చని ప్రముఖ న్యాయవాది బొర్రా రామకృష్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇంకొల్లు మండల హెల్త్ ఫస్ట్ ఎయిడర్స్ వెల్ఫేర్ సొసైటీ, ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పర్చూరు న్యాయస్థానం సంయుక్తంగా ఇంకొల్లు హనుమోజీ పాలెం రోడ్‌లోని చర్చి ఆవరణ నందు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో మాట్లాడారు. మొత్తం 150 మందికి ఈ వైద్య శిబిరం ద్వారా షుగర్, బీపీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రావి నూతల శ్రీనివాసరావు, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్స్ జయరామిరెడ్డి, దుర్గారావు, ప్రభావతి, గ్రామీణ వైద్యులు నాగేశ్వరరావు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

15 మందిపై కేసు నమోదు

మార్టూరు: గ్రామ సర్పంచ్‌ని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించిన విషయంలో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు మార్టూరు సీఐ ఎస్కే టీ ఫిరోజ్ శుక్రవారం తెలిపారు. ద్రోణాదుల గ్రామ సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు, గ్రామస్తులు మధ్య ఏర్పడిన వివాదంలో గురువారం రాత్రి సర్పంచ్‌ని పంచాయతీ కార్యాలయం నుంచి వెలుపలికి రానివ్వకుండా కొందరు స్థానికులు నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఫిరోజ్ ఇతర సిబ్బందితో కలిసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సర్పంచ్ భాగ్యారావు ఇచ్చిన ఫిర్యాదుతో 15 మందిపై కేసు నమోదు చేశారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజ

చీరాల టౌన్: సమాజ సేవా కార్యక్రమాల్లో రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి ముందంజలో ఉండటం అభినందనీయమని చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ జి.శ్యామల అన్నారు. శుక్రవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోటరీక్లబ్ ఆఫ్ క్షీరపురి ఆధ్వర్యంలో ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీరాల ఆర్టీసీ డిపో మేనేజర్ జి.శ్యామల, ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్, క్లబ్ అధ్యక్షుడు రామకృష్ణ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రావి వెంకటరమణ, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు ఉన్నారు.

పేదల వైద్యానికి పెద్ద పీట



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వెంకయ్య, వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అశోక్ తదితరులు

ఒంగోలు: పేదవర్గాల వైద్యానికి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం చాలా తక్కువగా ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ఉందని, అటువంటిది మన రాష్ట్రంలో అందుబాటులోకి తీసుకురావడం వైద్యరంగంలో ఒక విప్లవంగా పేర్కొన్నారు. 10032 క్లినిక్‌లను నిర్మించారన్నారు. గతంలో కేవలం 11 మెడికల్ కాలేజీలు రాష్ట్రంలో ఉంటే నేడు మరో 17 కాలేజీలు నిర్మాణం జరుగుతుండటం గుర్తించాలన్నారు. ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్‌బాబు మాట్లాడుతూ గతంలో కేవలం 1055 రోగాలు మాత్రమే ఆరోగ్యశ్రీలో ఉండేవని, కానీ నేడు 3255 రోగాలను చేర్చడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ జీవన్ మాట్లాడుతూ నిరంతరం మందులు వాడుతుంటేనే జబ్బు క్రమంగా తగ్గుముఖం పడుతుందన్నారు. పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసు వెంకయ్య మాట్లాడుతూ 108 వాహనం తీసుకువచ్చి వైఎస్సార్ పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. డాక్టర్ నంద కిషోర్, డాక్టర్ అరుణ్, డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొని ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రజలు మిక్కిలిగా వినియోగించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లాలి

- వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు



మద్దిపాడులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు

మద్దిపాడు: గృహ సారథులు, గ్రామ కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావు సూచించారు. స్థానిక కళా కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించడంతో పాటు ఆ కుటుంబ సభ్యుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని చెప్పారు. మండల జేసీఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ గృహ సారథులు, కన్వీనర్లు ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి ప్రజల ఫోన్ల ద్వారా కన్వీనర్లకు అందించిన ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని తెలిపారు. మండలం మొత్తం మా నమ్మకం నువ్వే జగనన్న అనే కార్యక్రమాలు ప్రారంభించాలని సూచించారు. మండలంలోని దొడ్డవరం, బసవన్నపాలెం తదితర గ్రామాల్లో కార్యక్రమాలు మొదలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మోరబోయిన సంజీవరావు, గ్రామ సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, పొగాకు బోర్డు వైస్ చైర్మన్ మద్దా లక్ష్మీనారాయణ, పలువురు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

జగనన్నపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది...


ఉప్పుగుండూరులో ఇంటింటికి స్టిక్కర్ అంటిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు: సీఎం జగనన్న పాలనపై ప్రజల్లో విశ్వాసం, నమ్మకం మరింత పెరిగిందని మండలంలోని ఉప్పుగుండూరు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మాదాసు రాంబాబు అన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని శుక్రవారం ఉప్పుగుండూరు లోని సచివాలయం -2 పరిధిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలనలో ఆ కుటుంబాలకు అందిన సంక్షేమ ఫలాలు, పాలనపై అభిప్రాయాలు తీసుకుని ఆ కుటుంబ సభ్యులతో జగనన్నే మా నమ్మకం అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయించారు. పోతరవం బీసీ కాలనీలో సచివాలయ కన్వీనర్లు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవరకొండ జయమ్మ, ఎంపీటీసీ తాటి అనూరాధ, కొలకలూరి విజయ్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు కందుల డానియేలు, మద్దిసాని రాజేష్, పాలపర్తి ప్రవీణ్, పెంట్యాల శ్రీనివాసరావు, పక్కెల వజ్రంబాబు, డాకా అంజిరెడ్డి, కాకునూళ్ల పద్మ, శీలం సురేష్, పూనూరి గోపాల్ రెడ్డి, కాకునూళ్ల సుబ్బారావు, జంపు శ్రీనివాసరావు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి ఘనంగా చక్రస్నానం


స్వామివారిక పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన పుష్కరణిలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. రాత్రి 7గంటలకు భారీగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చల్లా నాగేశ్వరమ్మ బృందంచే సంగీత విభావరి జరిగింది. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ఈఓ డి.రజనీ కుమారి, కుర్రా ప్రసాద్ బాబు, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు, పేర్నమిట్టలో 'జగనన్నే మా భవిష్యత్తు'


సంతనూతలపాడులో స్టిక్కర్లు అంటిస్తున్న దుంపా చెంచిరెడ్డి

చీమకుర్తి: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి సంతనూతలపాడు, ఒంగోలు నగరపాలక సంస్థ 6వ డివిజన్‌లోని పేర్నమిట్ట నిర్వహించారు. సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, దుంపా యలమందారెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడి స్టిక్కర్లు అంటించారు. టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. పేర్నమిట్టలో 6 డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సంతనూతలపాడు మండలంలోని రుద్రవరం, మైనంపాడు తదితర పంచాయతీల్లో స్థానిక సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా బ్రిలియంట్ కంప్యూటర్స్ వార్షికోత్సవం

ఒంగోలు: బ్రిలియంట్ కంప్యూటర్స్ 28వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా బ్రిలియంట్ కంప్యూటర్స్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ న్యామతుల్లా బాషా, ఎండీ డాక్టర్ తాహూర భారీ కేక్ కట్ చేసి విద్యార్థులతో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్యతో అత్యంత ఉపయోగకరమైన కోర్సులను అందిస్తున్నామన్నారు. అనేక సంస్థల నుంచి ఆథరైజేషన్ పొంది సర్టిఫికెట్లను అందిస్తున్న ఏకైక సంస్థ తమదన్నారు. 28 వసంతాలు పూర్తయిన సందర్భంగా 100 మంది పేద విద్యార్థులకు జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. సంస్థ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరాముడి పట్టాభిషేకం


సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

కొనకనమిట్ల: మండలంలోని పాతపాడులో శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా శుక్రవారం శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. యువకులు రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్న, ఆంజనేయ స్వామి వేషధారణతో కళశాలు ఎత్తుకుని ఉత్సవంలో పాల్గొన్నారు. ముందుగా ఉభయదాతలు ఆలయంలో ఆకుపూజ నిర్వహించారు.

స్వామి వారికి ముత్యాలు బహూకరణ

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణం శుక్రవారం నిర్వహించారు. స్వామి వారి కల్యాణ కట్టడిలో కూర్చున్న మార్కాపురం పట్టణానికి చెందిన అచ్చుత ప్రవీణ్‌కుమార్, గీతా దంపతులు స్వామి కల్యాణంలో తలంబ్రాలు వేసేందుకు కిలో ముత్యాలు రూ.18 వేల రూపాయల విలువ చేసే తెల్లటి, ఎర్రవి, ఆకు పచ్చ ముత్యాలు స్వామికి బహూకరించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో ఎంపీటీసీ యద్దనపూడి జాన్‌మార్క్ ఆధ్వర్యంలో ఈస్టర్ పండగ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎస్ఐ సైదుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా 30 టీమ్‌లు పాల్గొన్నాయి. ఎస్ఐ సైదుబాబు టాస్ వేసి క్రికెట్ ప్రారంభించారు. ఓ టీమ్‌లో ఎస్ఐ క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు.

వైభవంగా జెండాల పండగ

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో నాగులీరాస్వామి ఉరుసు సందర్భంగా శుక్రవారం జెండాల పండగను అత్యంత వైభవంగా నిర్వహించారు. కొలువైన పీరుకు పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం రైతులు ఎద్దుల బండిపై బిందెలు ఏర్పాటు చేసుకుని గ్రామంలో వీధుల్లో తప్పెట్లు, మేళాలతో ఊరేగింపుగా ఊరి చివరికి బయల్దేరి బిందెలకు మంచి నీటిని నింపుకొని అందులో బెల్లం కలిపి పానకంలా తయారు చేసి భక్తులకు పోసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక జెడ్పీహెచ్ పాఠశాల బాల బాలికలతో శ్రీరామ కోలాటం అలరించింది. రాత్రి భక్తుల కోసం దాతలు అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాత్రి రెండు పాటక చ్చేరీలు ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి సమయంలో మకాణంలో కొలువు దీరిన పీరుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఊరేగింపు చేశారు.

గుంటి గంగకు చేరిన పావనం

గుంటి గంగ (తాళ్లూరు): గంగా భవాని దేవర పుచ్చకాయల వారి ఇంటి నుంచి కటకంశెట్టి వంశస్తుల ద్వారా బయల్దేరిన పావనం పలు గ్రామాల్లోని భక్తులకు దర్శనమిచ్చింది. పావనం శుక్రవారం గంగా భవాని ఆలయానికి చేరింది. సోమవరప్పాడు, రామభద్రాపురం, తూర్పుగంగవరం గ్రామాల్లో ఉత్సవంగా భక్తులు దర్శించుకొన్నారు. సోమవరప్పాడు గ్రామానికి బొల్లావులతో పాటు ఉత్సవంగా తిరిగి తీసుకెళ్లారు. పంచలోహ తొడుగుతో అమ్మవారి విగ్రహాన్ని అలంకంచి బొల్లావులు, నాగపడిగలతో ఉత్సవంగా శనివారం ఉదయం గుంటి గంగా భవాని ఆలయానికి తరలిస్తారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి


తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న తెప్ప

రాచర్ల: దేవస్థానం సమీపంలోని నీటి గుండంలో శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే నెమలిగుండ్లరంగనాయకస్వామి తెప్పోత్సవానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. తెప్పోత్సవం నిర్వహించే సమయంలో నీటిగుండం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు ఒంగోలు ఎంపీ మాగుంట రాక

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒంగోలుకు వస్తున్నట్లు మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 గంటలకు ఒంగోలుకు చేరుకుంటారని, 11 గంటలకు తాళ్లూరు మండలం గంగవరం గ్రామం వద్ద ఉన్న శ్రీగుంటివ గంగమ్మ దేవాలయంలో తిరునాళ్ల సందర్భంగా జరుగు పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటకు ఒంగోలులోని తన కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 5.30 గంటలకు ఒంగోలు రైల్వేస్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు స్వాగత కార్యక్రమంలో పాల్గొంటారు. 7 గంటలకు శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరవుతారు. 7.30 గంటలకు ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో జగ్జీవన్‌రాం, జ్యోతిరావుపూలే, అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న నాటికల పోటీల్లో పాల్గొంటారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సత్కారం


ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న దళిత సంఘాల నేతలు

ఒంగోలు: అమరావతి నుంచి మదనపల్లె వెళుతూ మార్గమధ్యంలో ఆగిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ యం.విక్టర్ ప్రసాద్‌ను పలువురు దళిత సంఘాల నాయకులు కలిసి సత్కరించారు. ఈస్ట్‌కేబీలో కలుసుకుని పలు అంశాలపై సమీక్షలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దళితుల భూములు అగ్రకులస్తుల ఆక్రమణకు గురయ్యాయని వాటిపై సకాలంలో విచారణ చేయకుండా, ఛార్జిషీటు వేయకుండా ఉన్న అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎస్.లక్ష్మానాయక్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


ఈతముక్కలలో సిలువ మార్గం నిర్వహిస్తున్న దృశ్యం

ఈతముక్కల (కొత్తపట్నం): మండలంలో వివిధ చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. ఈతముక్కల గ్రామం ఎస్సీ కాలనీలో శిలువ మార్గం జరిగింది. ఈతముక్కల చర్చి నుంచి ఆర్‌సీఎం చర్చి దాక బస్టాండ్‌సెంటర్, బ్యాంక్ బజార్ ఏసుక్రీస్తు సిలువ భుజాన పెట్టుకుని శిలువ మార్గం నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య, ఇంజేటి, సంఘ పెద్దలు, గడ్డం అమృతపాణి పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం


కందుకూరు: కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ప్రజలు

కందుకూరు అర్బన్: పట్టణంలోని పెద్దబజారులో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కన్నుల పండువగా సీతారాములు కళ్యాణం మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రామచంద్రాచార్యులు, పవన్ స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సీతారామల కళ్యాణం జరిపారు. ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు దంపతులు, గుర్రం సింగయ్య దంపతులు, పేటేటి కృష్ణ దంపతులు, పద్మనాభుని శ్రీను దంపతులు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.

పోలేరమ్మతల్లికి చద్దులు

కందుకూరు అర్బన్: కందుకూరు పట్టణంలోని శ్రీ పోలేరమ్మతల్లికి, శ్రీ మహాలక్ష్మమ్మ తల్లికి చద్దులు, పానకం వడపప్పును పెట్టే కార్యక్రమం ఈనెల 9వ తేదీ నుంచి 15వ వరకు జరుగుతుందని గ్రామ దేవతల వారసత్య ధర్మకర్త దివి లింగయ్య నాయుడు తెలిపారు. అదే విధంగా ఈనెల 16న ఆదివారం శ్రీ అంకమ్మతల్లికి పొంగళ్లు పెట్టుకోవాలని తెలియజేశారు.

నేడు గుంటి గంగా భవాని తిరునాళ్లు


అమ్మవారి మూలవిరాట్

తాళ్లూరు: జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన గుంటి గంగా భవాని ఆలయం 98వ వార్షికోత్సవ తిరునాళ్లను శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఈ ఆలయంలో ప్రతి ఏడాది చైత్రమాసం బహుళ విధియనాడు వైభవంగా తిరునాళ్లు నిర్వహిస్తారు. ఈ ఏడాది తిరునాళ్లలో 11 విద్యుత్ ప్రభలను పలు రాజకీయ పార్టీల మద్దతుదారులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో వైఎస్సార్ సీపీకి చెందిన వారివి ఏడు ప్రభలు ఉండగా, టీడీపీ రెండు, జనసేన పార్టీ మద్దతుదారులు రెండు ఏర్పాటు చేస్తున్నారు. దర్శి డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 30 మంది ఎస్సైలు, మూడు ప్రత్యేక పార్టీలతో దాదాపు 600 మంది బందోబస్తు నిర్వహించనున్నట్లు దర్శి సీఐ రామకోటయ్య తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

నేడు ఇఫ్తార్ విందు

కంభం: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక కూరగాయల మార్కెట్‌లో ఎంజీ బ్రదర్స్ సర్దార్ అలిఖాన్, ఎంఎ గఫార్ అలిఖాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పట్టణంలోని ముస్లింలు తప్పనిసరిగా ఇఫ్తార్ విందుకు హాజరు కావాలని కోరారు.